సాక్షి నారాయణపేట

సోమవారం | 15 | జూలై | 2024



ఎదురుచూపులు..
గతేడాది మాదిరిగానే ఈసారి కూడా కృష్ణానదికి వరద జలాలు రావడం లేదు.

వివరాలు 8లో ▸



సూర్య నమస్కారాలు..
సూర్యనమస్కారాలతో మానసిక బలం చేకూరుతుందని కృష్ణజ్యోతి స్వామీజి అన్నారు.

వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
27.4 /23.1
రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

నారాయణపేట రూరల్‌: తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తుందని ఆర్‌ఎం శ్రీదేవి, డీఎం లక్ష్మిసుధ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న పౌర్ణమి వేడుకలను రీజియన్‌ పరిధిలోని మహబూబ్‌నగర్‌, నాగర్‌కర్నూల్‌ డిపోల నుంచి సూపర్‌లగ్జరీ బస్సు సర్వీసులు నడపనున్నట్లు, ఈ నెల 19న రాత్రి 9గంటలకు బయలుదేరి 20న ఉదయం కాణిపాకం, సాయంత్రం వేలూర్‌ గోల్డెన్‌ టెంపుల్‌ దర్శనం చేయించి రాత్రి అరుణాచలానికి చేరుకుంటుందని తెలిపారు. గిరిప్రదర్శన అనంతరం 21న సాయంత్రం 4గంటలకు తిరుగు ప్రయాణమై 22 ఉదయం 6గంటలకు ఆయా బస్టాండులకు బస్సులు చేరుకుంటాయని తెలిపారు. టూర్‌ ప్యాకేజీ ఒక్కరికి రూ.3600, పిల్లలకు రూ.2400గా నిర్ణయించినట్లు తెలిపారు. నారాయణపేట ప్రాంతవాసులు కోరితే స్థానిక బస్టాండ్‌ నుంచి సైతం బస్సు ఏర్పాటు చేస్తామని, ఆసక్తిగల భక్తులు www.tsrtconine.in వెబ్‌సైట్‌ను, దగ్గరలోని బస్‌పాస్‌ కౌంటర్‌లో సంప్రదించాలని, వివరాలకు సెల్‌ నం.9959226293కు కాల్‌ చేయాలని తెలిపారు.

నేడు సాగునీటి విడుదల

నర్వ: రైతుల అభ్యర్థన మేరకు భూత్పూర్‌ రిజర్వాయర్‌ నుంచి మండల రైతాంగానికి సాగునీటిని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సోమవారం విడుదల చేయనున్నట్లు కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్‌ తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని సాగునీటి పరివాహక ప్రాంతాలు రాయికోడ్‌, కల్వాల్‌, సీపూర్‌, అప్పంపల్లి, కొత్తపల్లి, పెద్దకడ్మూర్‌, జలక్కన్నపల్లి, యాంకి, లక్కర్‌దొడ్డి, ఎల్లంపల్లి, బెక్కర్‌పల్లి, రైతులు, ప్రజాప్రతినిధులు తరలిరావాలని పిలుపునిచ్చారు.


బీసీల హక్కుల సాధనకు పోరాటం

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: బీసీల ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయ పోరాటానికి ఉత్పత్తి కులాలన్నింటినీ ఏకం చేసే పనిలో బీసీ కార్మిక, కర్షక, విద్యార్థి, మేధావులు ఒక్కటిగా నిలిచి కదలాలని తెలుగు అకాడమీ పూర్వ అధ్యక్షుడు, బీసీ కమిషన్‌ మాజీ సభ్యుడు జూలూరు గౌరీశంకర్‌ అన్నారు. పాలమూరు సాహితీ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని లుంబిని పాఠశాలలో ఆదివారం 'ధిక్కార' పుస్తక పరిచయ, కవితా సంకలన ఆవిష్కరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీసీలు తమ అస్థిత్వాన్ని తాము వెతుక్కుంటూ హక్కుల సాధన కోసం పోరాటం చేస్తున్న సందర్భంలో బీసీ విద్యావంతులు, ఆలోచనాపరులు, బీసీ కవులు, రచయితలు బహుజన ఉద్యమ రూపకల్పన చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బీసీలను ఓటుబ్యాంకుగా మార్చి 77 ఏళ్లుగా పాలన కొనసాగిస్తున్న పాలకుల నైజాన్ని తెలియజేస్తూ ఊరువాడలను ఏకం చేయాల్సిన పనిని బీసీ ఉద్యమకారులు చేపట్టాలన్నారు. ప్రముఖ రచయిత, పీపీ బెక్కం జనార్దన్‌ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావుపూలే అణగారిన వర్గాల కోసం అహర్నిశలు కృషి చేసిన గొప్ప మేధావి అన్నారు. జ్ఞానసముపార్జన ద్వారానే రాజ్యాధికారం లభిస్తుందన్న పూలే వాక్కులు నేటికీ ఆచరణీయమన్నారు. సభకు అధ్యక్షత వహించిన లుంబిని పాఠశాల డైరెక్టర్‌ కె.లక్ష్మణ్‌గౌడ్‌ మాట్లాడుతూ ఆధునిక సామాజిక భారత నిర్మాత మహాత్మా జ్యోతిరావుపూలే సమాజానికి అక్షరజ్ఞానాన్ని అందించి బాల్య వివాహాలను నిర్మూలన చేసిన సంఘ సంస్కర్త అని కొనియాడారు. పాలమూరు సాహితీ అధ్యక్షుడు భీంపల్లి శ్రీకాంత్‌ పుస్తక సమీక్ష చేస్తూ ధిక్కార కవితా సంకలనంలోని 156 కవితలు జ్యోతిరావుపూలే వ్యక్తిత్వాన్ని, సామాజిక ఉద్యమ స్వరూపాన్ని చక్కగా ఆవిష్కరించాయన్నారు. ఇందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రాలకు చెందిన కవలున్నారన్నారు. కార్యక్రమంలో పుస్తక సంపాదకులు వనపట్ల సుబ్బయ్య, కవులు నాగవరం బాలరాం, వహీద్‌ఖాన్‌, కందికొండ మోహన్‌, బోల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగవిద్యకు దూరం

ప్రభుత్వ పాఠశాలల్లో కానరాని సైన్స్‌ పరికరాలు

- ఐదేళ్లుగా నిధుల విడుదల హుళక్కే..
- ఇన్‌స్పైర్‌, సైన్స్‌ఫెయిర్‌ పోటీల్లో వెనకబడుతున్న విద్యార్థులు



మక్తల్‌: ఐదేళ్లుగా నిధులు విడుదల కాకపోవడం.. సరిపడా ప్రయోగ పరికరాలు లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ప్రయోగవిద్యకు దూరమవుతున్నారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సైతం సైన్స్‌ విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రయోగశాలలు ఏర్పాటుచేసినా నిధుల లేమితో లక్ష్యం నీరుగారుతోంది. విధిలేని పరిస్థితుల్లో ఉపాధ్యాయులు ప్రస్తుతం ఉన్న పరికరాలతోనే పాఠాలు బోధించి మమ అనిపిస్తున్నారు.

జిల్లాలో 76 జెడ్పీహెచ్‌ఎస్‌లు, 85 యూపీఎస్‌లు, 314 ప్రాథమిక పాఠశాలల్లో మొత్తం 58,620 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థులకు ఎంతో విలువైన సైన్స్‌ జ్ఞానాన్ని ప్రయోగాత్మకంగా అందించకపోవడంతో సైన్స్‌ ప్రయోగాలపై వారికి అవగాహన లేకుండా పోతోంది.



మంతన్‌గోడ్‌లో జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల

ఐదేళ్లుగా జాడలేని నిధులు

2019 రాష్ట్రీయ మాధ్యమిక్‌ శిక్షా అభియాన్‌ ద్వారా ప్రతి ఉన్నత పాఠశాలలకు రూ.50వేలు, ప్రాథమిక ఉన్నత పాఠశాలలకు సర్వశిక్ష అభియాన్‌ ద్వారా రూ.22 వేలు నిధులను విడుదల చేశారు. వీటి ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఐదేళ్ల క్రితం కొన్ని పరికరాలు కొనుగోలు చేశారు. అనంతరం ఆర్‌ఎంఎస్‌ఏ పథకం అమలు నిలిచిపోవడంతో నిధులు మంజూరు కాలేదు. దీంతో పాఠశాలల్లో ప్రయోగాత్మక బోధన నిర్వహణ కష్టతరంగా మారింది. అందుబాటులో ఉన్న పరికరాలతో పాటు కాలం చెల్లించిన రసాయనాలతో ఉపాధ్యాయులు విద్యార్థులతో ప్రయోగాలు చేయిస్తూ.. నామమాత్రంగా వివరిస్తు కాలం గడుపుతూ వస్తున్నారు.

పోటీలకు దూరం

ప్రయోగాలపై పూర్తిస్థాయి అవగాహన లేకపోవడంతో సైన్స్‌కు సంబంధించిన ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు పోటీలకు దూరంగా ఉంటున్నారు. ప్రతి ఏడాది ప్రభుత్వం నిర్వహించే సైన్స్‌ ఫేర్‌, ఇన్‌స్పైర్‌ అవార్డుల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు వెనుక పడుతున్నారు. ప్రతిభ ఉన్నా.. సరిపడా శిక్షణ, అవగాహన లేకపోవడంతో సత్తా చాటలేకపోతున్నారు. ఇప్పటికైన విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి ప్రయోగాత్మక బోధనకు అవసరమైన పరికరాలు సమకూర్చడంతోపాటు ప్రయోగవిద్య సక్రమంగా జరిగేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రయోగాలు కీలకం

6వ తరగతి నుంచి పదవతరగతి విద్యార్థులకు సైన్స్‌ సబ్జెక్టులో ఎక్కువ భాగం ప్రయోగాలతో కూడిన పాఠ్యాంశాలు ఉంటాయి. వాటిని ప్రయోగం చేసి చూపితే కాని అర్థం కాని పరిస్థితి. దీంతో ప్రయోగత్మక బోధనపై సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా దృష్టి సారిస్తారు. ఇందుకోసం ప్రయోగ పరికరాలు, రసాయనాల కొనుగోలుకు గతంలో విద్యా శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అప్పట్లో అరకొర నిధులు మంజూరు చేయగా.. కొద్దిపాటి పరికరాలు కొనుగోలు చేశారు. ఈ కొద్దిపాటి పరికరాలతో ప్రయోగాలు సంపూర్ణంగా చేసే అవకాశం లేకపోవడంతో పలు పాఠశాలల్లో అవిసైతం మూలన పడ్డాయి.

నిధులు మంజూరు కాలే..

దాదాపు రెండేళ్ల నుంచి పాఠశాలల్లో సైన్స్‌ పరికరాలు కొనుగోలుకు ఎలాంటి నిధులు మంజూరు కాలేదు. ఒకవేళ నిధులు మంజూరైతే వెంటనే పరికరాలు, రసాయనాలు కోనుగోలు చేస్తాం. ప్రస్తుతం విద్యార్థులకు కావాల్సిన కొన్ని సైన్స్‌ పరికరాలను ఉపాధ్యాయులు స్వయనా తయారు చేసి అవగహన కల్పిస్తున్నారు. గతేడాది సైన్స్‌ఫెయిర్‌పై ఆన్‌లైన్‌ ద్వారా అవగాహన కల్పించాం. విద్యార్థులు పోటీల్లో పాల్గొని అవార్డులు సైతం గెలుపొందారు.

– అబ్దుల్‌ ఘనీ, డీఈఓ

బదిలీ అయిన టీచర్లను రిలీవ్‌ చేయాలి



మాట్లాడుతున్న రవికుమార్‌

నారాయణపేట రూరల్‌: ఇటీవల నిర్వహించిన బదిలీ ప్రక్రియలో స్థానచలనం కల్గిన ఎస్‌జీటీ టీచర్లను వెంటనే రిలీవ్‌ చేసి కొత్త స్థానాల్లో చేరే విధంగా ఆదేశాలు ఇవ్వాలని యూటీఎఫ్‌ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్‌ డిమాండ్‌ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆ సంఘ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏళ్ల తరబడి నీరక్షణకు తెరతీస్తు రాష్ట ప్రభుత్వం బదిలీల ప్రక్రియ చేపట్టిన వారిని రిలీవ్‌ చేయకుండా ఆపడం సరికాదని విమర్శించారు. 8 నుంచి 12 సంవత్సరాల పాటు ఒకేచోట పనిచేసి స్థాన చలనం దక్కిందని ఆనందపడుతుంటే వారికి నిరాశ కల్గించడం సరికాదన్నారు. జూలై 1న జాయినింగ్‌ తేదీని నిర్ణయిస్తూ వారికి కొత్త స్థానాలకు పంపించాలని కోరారు. ఎస్‌టీపీఎస్‌తో పాటు ఇబ్బందిగా ఉన్న చోట్ల దగ్గరలోని పాఠశాలల నుంచి తాత్కాలికంగా డిప్యూటేషన్లు ఇవ్వాలని, వీలైనంత త్వరాగా వలంటీర్ల నియామకం చేపట్టాల, పీఈటీ, ఎల్‌పీ హిందిలో మిగిలిపోయిన వారు డీఈఓ కార్యాలయంలో రిపోర్టు చేశారని, వారికి ఇబ్బందులు కల్గించకుండా సౌకర్యవంతంగా బైపోస్టుల్లో నియమించాలని కోరారు. స్కూల్‌ అసిస్టెంట్‌, పీఎస్‌ హెచ్‌ఎంలలో లెఫ్ట్‌ ఒవర్‌ వెకెన్సీస్‌ను వెంటనే తదుపరి సీనియార్టీ టీచర్లతో భర్తీ చేయాలని కోరారు. సాంకేతిక కారణాలు, తప్పిదాల కారణంగా నష్టపోయిన టీచర్లకు న్యాయం చేయాలని డిమాండ్‌ చేశారు. మోడల్‌స్కూల్‌, గురుకుల, కేజీబీవీ టీచర్ల సమస్యలతో పాటు జీఓ 317 బాధితుల వినతులను వెంటనే పరిష్కరించాలన్నారు. బడ్జెట్‌లో 15శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలన్నారు. కార్యక్రమంలో వేణుగోపాల్‌, బాలాజి, వెంకటస్వామి, భీమయ్య, సాయప్ప, వెంకట్‌నాయక్‌, మహేందర్‌గౌడ్‌, వెంకటేష్‌ పాల్గొన్నారు.

నేడు జడ్చర్లకు మంత్రుల రాక

జడ్చర్ల: నియోజకవర్గంలో సోమవారం ముగ్గురు రాష్ట్ర మంత్రులు పర్యటించనున్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఇన్‌చార్జ్‌ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎక్సైజ్‌, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో కలిసి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ముందుగా బాలానగర్‌లో బాలానగర్‌ నుంచి జడ్చర్ల మండలం గంగాపూర్‌ వరకు రూ.56 కోట్లతో చేపట్టనున్న డబుల్‌ రోడ్డు విస్తరణ, రూ.30 కోట్లతో రాజాపూర్‌ నుంచి రంగారెడ్డిగూడ వరకు కల్లెపల్లి, ఈద్గాన్‌పల్లి మీదుగా చేపట్టనున్న రోడ్డు విస్తరణ, రూ.20 కోట్లతో చేపట్టే నవాబ్‌పేట నుంచి తిరుమలాపూర్‌ రోడ్డు విస్తరణ, రూ.12 కోట్లతో మిడ్జిల్‌ నుంచి కొత్తూరు మీదుగా కొత్తపల్లి వరకు చేపట్టే రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం జడ్చర్లలోని ప్రేమ్‌రంగా గార్డెన్‌లో నిర్వహించే విలేకరుల సమావేశంలో మంత్రులు మాట్లాడుతారని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పాలమూరులో జగన్నాథుడి రథయాత్ర

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: జిల్లాకేంద్రంలో మూడోసారి ఆదివారం శ్రీజగన్నాథ రథయాత్ర మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేసి హారతి ఇచ్చారు. అనంతరం స్థానిక టీటీడీ కల్యాణ మండపం నుంచి శ్రీజగన్నాథ రథయాత్ర ప్రారంభమైంది. భక్తుల జై జగన్నాథ, హరే కృష్ణ నామస్మరణతో భక్తిభావం ఉప్పొంగింది. శ్రీజగన్నాథ రథయాత్ర దర్శనం కోసం పట్టణ ప్రజలు భారీగా తరలివచ్చారు. భక్తులు రెండు వైపుల నిల్చొని రథాన్ని లాగారు. రథయాత్రలో భక్తులు కోలాటాలు, సంకీర్తనలతో శ్రీజగన్నాథ రథయాత్రకు స్వాగతం పలికారు.



పట్టణంలో శ్రీజగన్నాథ రథయాత్రలో పాల్గొన్న భక్తులు

సీట్ల భర్తీ అంతంతే



'దోస్త్‌' ద్వారా అడ్మిషన్లు చేపట్టిన ప్రభుత్వం

- 31 వేల సీట్లకు గాను 9,709 మంది మాత్రమే చేరిక
- అడ్మిషన్లు లేక వెలవెలబోతున్న పలు ప్రైవేట్‌ కాలేజీలు
- ఉమ్మడి జిల్లాలో కొత్తగా ఆరు కళాశాలల ఏర్పాటు
- నేటినుంచి ప్రారంభం కానున్న తరగతులు

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ ప్రభుత్వ, ప్రైవేట్‌ కళాశాలల్లో సీట్లు భర్తీ చేసేందుకు ప్రభుత్వం దోస్త్‌ ద్వారా అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టింది. గత నెలలో ప్రారంభమైన ఈ ప్రక్రియలో ఇప్పటికి మూడు దశల్లో అడ్మిషన్లు చేపట్టినప్పటికీ పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ కాలేదు. ఉమ్మడి జిల్లాలోని 93 కళాశాలల్లో 31 వేల సీట్లు ఉండగా కేవలం 9,709 మంది మాత్రమే చేరారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. దీంతో ప్రభుత్వం మరో రెండుసార్లు కౌన్సిలింగ్‌ నిర్వహించే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో మరో 6 డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేసింది. వీటిలోనూ అడ్మిషన్లు అంతంతగానే ఉన్నాయి. అయితే కొత్తగా ఏర్పాటు చేసిన కళాశాలల్లో వసతులు, అధ్యాపక పోస్టులు లేక అడ్మిషన్లు జరగలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ సంవత్సరం కళాశాలల్లో సీట్లను పెంచేందుకు ప్రభుత్వం ఉద్యోగ ఆధారిత కోర్సులను సైతం ప్రవేశపెట్టింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు సైతం తమ కళాశాలల్లో చేరాలని కోరుతూ కరపత్రాలతో ప్రచారం చేయడం గమనార్హం. ఈ నేపథ్యంలో విద్యార్థులు డిగ్రీలో చేరకపోవడానికి గల కారణాలను వెతికే పనిలో అధికారులు పడ్డారు.

మొత్తం 93 కళాశాలలు..

పీయూ పరిధిలో మొత్తం 93 ప్రభుత్వ, ప్రైవేట్‌ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటిలో మొత్తం 31 వేల సీట్లు భర్తీ చేయాల్సి ఉంది. కానీ, పీయూ పరిధిలో మూడు దశల్లో చేపడితే కనీసం 10 వేల సీట్లు కూడా భర్తీ కాలేదు. మొదటి దశలో 3,051, రెండో దశలో 2,120 మూడో దశలో 4,538 ఉన్నాయి. సోమవారం నుంచి తరగతులు ప్రారంభమవుతుండగా.. శుక్రవారం వరకు సెల్ఫ్‌ రిపోర్టింగ్‌ చేసేందుకు అవకాశం ఉండడంతో మరిన్ని అడ్మిషన్లు పెరగవచ్చని భావిస్తున్నారు. అయితే అడ్మిషన్లు తక్కువ అయిన క్రమంలో ప్రైవేట్‌ కళాశాలల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతంలో ఒక్కో కోర్సులో ఉన్న మొత్తం సీట్లలో 25 శాతం భర్తీ కాకపోతే ఆ విద్యార్థులను వేరే కళాశాలలకు బదిలీ చేసేవారు. ఈ నేపథ్యంలోనే గత ఐదేళ్లలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 10కిపైగా కళాశాలలు మూతబడ్డాయి. ఈ సంవత్సరం మరిన్ని కళాశాలలు మూతబడే అవకాశం ఉంది.

కొత్త డిగ్రీ కళాశాలల్లో చేరికలు ఇలా..

కళాశాల	అలాట్‌మెంట్‌	సెల్ఫ్‌ రిపోర్టు చేసినవారు
దేవరకద్ర	32	14
మద్దూరు	157	28
కోస్గి	13	8
ధన్వాడ	31	28
ఆమనగల్‌	21	13
మక్తల్‌	35	14

సీట్ల అలాట్‌మెంట్‌ విధానం..

విడతలు	అలాట్‌మెంట్‌లు	సెల్ఫ్‌ రిపోర్టులు
మొదటిది	4,499	3,051
రెండోది	2,670	2,120
మూడోది	5,367	4,538

మరో దశ కౌన్సెలింగ్‌..



ప్రభుత్వం జిల్లాకు కొత్త కళాశాలలు ఇవ్వడం సంతోషకరం. వాటిలో సీట్లను పూర్తిస్థాయిలో భర్తీ చేసేందుకు ప్రభుత్వం మరో దశ కౌన్సిలింగ్‌ నిర్వహించే అవకాశం ఉంది. ఈ క్రమంలో టీచింగ్‌కు ఇబ్బంది లేకుండా ప్రత్యేకంగా గెస్ట్‌ లెక్చరర్లను నియమిస్తారు. కౌన్సెలింగ్‌ చివరి వరకు దాదాపుగా సీట్లు భర్తీ అవుతాయి.

– మధుసూదన్‌రెడ్డి, పీయూ రిజిస్ట్రార్‌

కొత్త కళాశాలల్లో ఇలా..

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వం కొత్తగా 6 డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేసింది. ఈ కళాశాలలకు మొత్తం మూడు విడతల్లో 289 మంది విద్యార్థులను ప్రభుత్వం అలాట్‌ చేసింది. అయితే వీటిలో 50 మంది విద్యార్థులు కూడా చేరలేదని తెలుస్తుంది. మద్దూరు డిగ్రీ కళాశాలలో మూడు దశల్లో 157 మంది అలాట్‌మెంట్‌ అయితే ఇందులో కనీసం 28, దేవరకద్ర డిగ్రీ కళాశాలలో మూడో దశల్లో 32 మంది విద్యార్థులను అలాట్‌ చేస్తే 10 మంది చేరారు. ఈ కళాశాలలకు సంబంధించి టీచింగ్‌, నాన్‌ టీచింగ్‌ సిబ్బందిని ప్రభుత్వం నియమించకపోవడం, కనీస వసతులు కూడా లేకపోవడం అడ్మిషన్లు కాకపోవడానికి ఒక కారణం అని తెలుస్తుంది. సాధారణంగా విద్యార్థులకు బోధన విషయంలో ఇబ్బందులు లేకుండా గెస్ట్‌ ఫ్యాకల్టీని అయినా ప్రభుత్వం కేటాయిస్తుంది. అయితే అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి అయ్యాకే ఫ్యాకల్టీని ఇస్తుందని పలువురు అధికారులు పేర్కొంటున్నారు.

ప్రథమ బహుమతి అందుకుంటున్న మహబూబ్‌నగర్‌ జట్టు



ఫుట్‌బాల్‌ టోర్నీ విజేత పాలమూరు

- హోరాహోరీగా సాగిన ఫైనల్‌ మ్యాచ్‌
- తుదిపోరులో 1–0 తేడాతో నిజామాబాద్‌పై విజయం
- మూడో స్థానంలో నిలిచిన ఖమ్మం, నల్లగొండ
- విజేతలకు బహుమతులు అందజేసిన రాష్ట్ర ఫుట్‌బాల్‌ అసోసియేషన్‌ కార్యదర్శి ఫాల్గుణ

వివరాలు 8లో

– కల్వకుర్తి టౌన్‌

విద్యుత్‌ బిల్లులపై క్యూఆర్‌ కోడ్‌

- త్వరలో నూతన విధానం అమలు..
- ప్రస్తుత చెల్లింపులు నేరుగా లేదా డిస్కం సైట్లలోనే..
- జిల్లాలో 1,04,204 గృహ విద్యుత్‌ కనెక్షన్లు



మద్దూరు: ఆన్‌లైన్‌లో వివిధ యాప్‌(గూగుల్‌ పే, ఫోన్‌ పే, పేటీఎం, అమెజాన్‌)ల ద్వారా విద్యుత్‌ బిల్లుల చెల్లింపు కుదరదని రిజర్వు బ్యాంకు నిబంధన విధించింది. దీంతో విద్యుత్‌ పంపిణీ సంస్థ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తోంది. ఇక నుంచి డిస్కంకు సంబంధించిన వెబ్‌సైట్లు, యాప్‌ ద్వారా లేదంటే కార్యాలయాల్లో నేరుగా బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. ఈ విధానం చాలా రోజుల నుంచే మనుగడలో ఉంది. నారాయణపేట జిల్లాలో 1,04,204 గృహ విద్యుత్‌ కనెక్షన్లు ఉన్నాయి. బిల్లుల చెల్లింపులకు కార్యాలయాలకు వెళ్లడం, అక్కడ వేచి ఉండాల్సి రావడంతో చాలా మంది ఫోన్‌యాప్‌ల ద్వారా ఇన్ని రోజులు సులువుగా చెల్లించేవారు. ఇప్పటివరకు చాలా మంది ఫోన్‌పే, గూగుల్‌పే యాప్‌ల ద్వారా చెల్లిస్తున్నారు. ఆర్‌బీఐ తాజా నిబంధనలతో ఫోన్‌ యాప్‌ల ద్వారా చెల్లింపులు ఈ నెల ఒకటి నుంచి నిలిచిపోయాయి. డిజిటల్‌ చెల్లింపులకు అలవాటు పడిన వారికి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు విద్యుత్‌ పంపిణీ సంస్థలు విద్యుత్‌ బిల్లులపై క్యూఆర్‌ కోడ్‌ను త్వరలో ముద్రించనున్నాయి. ఇందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేస్తున్నారు. క్యూఆర్‌ కోడ్‌ చెల్లింపులు త్వరలో అందుబాటులోకి వస్తాయని విద్యుత్‌ అధికారులు పేర్కొంటున్నారు.

డిస్కం యాప్‌..

థర్డ్‌ పార్టీ యాప్‌ల ద్వారా చెల్లింపులు నిలిపివేయడంతో వినియోదారులు విద్యుత్‌ బిల్లుల చెల్లింపులో ఇబ్బందులు పడకుండా టీజీఎస్‌పీడీసీఎల్‌ వెబ్‌సైట్‌లో బిల్‌ డెస్క్‌, యాప్‌ ద్వారా బిల్లు కట్టవచ్చు. ప్లే స్టోర్‌ నుంచి టీజీఎస్‌పీడీసీఎస్‌ యాప్‌ డౌన్‌లోడ్‌ చేసుకోవాలి. పే బిల్‌లోకి వెళ్లి యూఎస్‌సీ నంబర్‌ నమోదు చేశాక క్రెడిట్‌, డెబిట్‌ కార్డు, యూపీఐ యాప్‌లు, వ్యాలెట్‌ నుంచి చెల్లించవచ్చు. ఈ యాప్‌లో చెల్లించేటప్పుడు జీపే, ఫోన్‌ పే, పేటీఎం యాప్‌లు అందుబాటులో ఉంటే వాటిని వినియోగించుకోవచ్చు. కానీ విద్యుత్‌ సిబ్బందికే ఈ యాప్‌ డౌన్‌లోడ్‌ కావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో విద్యుత్‌ నేరుగా బిల్లుల చెల్లింపులకు డబ్బులు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

త్వరలో పూర్తి వివరాలు

రాబోయే రోజుల్లో మీటర్‌ వద్ద రీడింగ్‌ తీసేటప్పుడు వినియోదారుల పూర్తి వివరాలు యూఎస్‌సీ నంబర్‌, మీటర్‌ నంబర్‌, బిల్లు వివరాలు క్యూఆర్‌ కోడ్‌లో ముద్రిస్తారు. వినియోగదారుడు క్యూఆర్‌ కోడ్‌ను స్కాన్‌ చేస్తే చాలు నేరుగా బిల్లు చెల్లించే అవకాశం ఉంటుంది. ఈ విధానం త్వరలో అమల్లోకి వస్తుంది.

– ప్రభాకర్‌, ట్రాన్స్‌కో ఎస్‌ఈ

బీజేపీవి స్వార్థ రాజకీయాలు

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ తన హయాంలో పేదల సంక్షేమానికి ఎంతో పాటుపడ్డారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ ఒబేదుల్లా కొత్వాల్‌ అన్నారు. జిల్లాకేంద్రంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 1975లో ఎమర్జెనీని ఇప్పటి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సంవిదాన్‌ హత్య దివస్‌గా గెజిట్‌ తీసుకురావడం సరికాదని, దీనిని వెంటనే విరమించుకోవాలని డిమాండ్‌ చేశారు. రాహుల్‌ గాంధీ నేతృత్వంలోని ఇండియా కూటమికి దేశవ్యాప్తంగా ప్రజల్లో వస్తున్న మద్దతును తట్టుకోలేక బీజేపీ ప్రభుత్వం ఎమర్జెన్సీని ముందుకు తెస్తుందని ఆరోపించారు. బీజేపీ విధానాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

బిజినేపల్లి/ గోపాల్‌పేట: రోడ్డు ప్రమాదంలో భర్త దుర్మరణం పాలవగా.. భార్య తీవ్రంగా గాయపడింది. పోలీసుల కథనం ప్రకారం.. గోపాల్‌పేట మండలం బుద్దారం పరిధిలోని లక్ష్మీతండాకు చెందిన కాట్రావత్ సంతోష్(30), భార్య శారదతో కలిసి హైదరాబాద్‌లో జీవనం సాగిస్తున్నారు. అయితే ఆదివారం తండాలో మైసమ్మ పండగ ఉండటంతో తెల్లవారుజామున కారులో హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో తిమ్మాజిపేట సమీపంలో మలుపు వద్ద కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంతోష్ అక్కడికక్కడే మృతిచెందగా భార్య శారద గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు బాధితురాలిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తిమ్మాజిపేట ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. సంతోష్ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


లష్కర్(ఫైల్)

బల్మూర్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు ఏఎస్‌ఐ రెణయ్య తెలియజేశారు. ఇందుకు సంబంధించి మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అంబగిరికి చెందిన కేతావత్ లష్కర్(46) గ్రామంలో ఉపాధి కరువై ఆర్థిక ఇబ్బందులతో ఎనిమిదేళ్ల కిందట భార్య పిల్లలను తీసుకొని హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. కాని ఈ నెల 10న తానొక్కడే స్వగ్రామానికి వచ్చాడు. తన ఇంట్లో పురుగు మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు అతడిని అచ్చంపేట ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నాలుగు రోజులుగా చికిత్స పొందుతూ.. ఆరోగ్య పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య చిట్టితో పాటు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఈ సంఘటనపై మృతుని తల్లి కేతావత్ నారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం చేయించినట్లు ఏఎస్‌ఐ తెలియజేశారు.

మనస్తాపంతో యువకుడు..


బోయ రాజు(ఫైల్)

ఎర్రవల్లిచౌరస్తా: కుటుంబ సమస్యల కారణంగా ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఎర్రవల్లి మండల పరిధిలోని బి.విపల్లికి చెందిన బోయ రాజు(28) పశువులు కాసుకుంటూ కుటుంబ సభ్యులతో కలిసి జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో వివిధ సమస్యల కారణంగా కుటుంబంలో తరుచుగా గొడవలు జరుగుతుండేవి. దీంతో మనస్తాపానికి గురై శనివారం రాత్రి ఇంట్లో ఎవరికి చెప్పకుండా గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. దీనిని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి వెళ్లి చూసే సరికి మృతుడు విగతజీవిగా పడి ఉండటంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. చేతికొచ్చిన కుమారుడు ఇలా అర్ధంతరంగా మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కుటుంబ కలహాలతో మహిళ..

ఖిల్లాఘనపురం: కుటుంబ కలహాలతో ఉరివేసుకుని ఓ మహిళ మృతిచెందిన సంఘటన మండలంలోని అల్లమాయపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. అల్లమాయపల్లికి చెందిన యాదయ్య, జమిస్తాపురానికి చెందిన స్వప్నకు 8 సంవత్సరాల కిందట వివాహమైంది. శనివారం భార్యాభర్తల గొడవపడ్డారు. దీంతో తన తల్లిగారింటికి వెళ్తాననడంతో భర్త, కొందరు గ్రామస్తులు వద్దని తెలియజేశారు. రాత్రి అందరూ భోజనం చేసి పడుకున్నారు. స్వప్న మరో గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆదివారం తెల్లవారినా.. భార్య గదిలోనుంచి బయటకు రాకపోవడంతో భర్త గదిలోకి వెళ్లాడు. అప్పటికే ఆమె ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతిచెంది కనిపించింది. వెంటనే కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. గ్రామానికి చేరుకున్న తల్లిదండ్రులు స్వప్న మృతిపై అనుమానం రావడంతో ఆదివారం ఖిల్లాఘనపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఏఎస్‌ఐ నాగరాజు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నల్లచెరువులో మృతదేహం లభ్యం

జడ్చర్ల: పట్టణ శివారులోని నల్లచెరువులో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి (50) మృతదేహం లభ్యమైనట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. చెరువులోని నీటిపై మృతదేహం తేలియాడుతూ స్థానికులకు కనిపించడంతో సమాచారం ఇచ్చారని.. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి మార్చురీకి తరలించినట్లు చెప్పారు. చిత్తు కాగితాలు సేకరించే వ్యక్తి స్నానానికి వెళ్లి నీట మునిగి ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

ఎదురుచూపులు..

కృష్ణానదికి ప్రారంభం కాని వరదలు


సోమశిల సమీపంలోని కృష్ణానదిలో నీటిమట్టం

- కల్వకుర్తి ఎత్తిపోతల పథకం వద్ద 813 అడుగుల ఎత్తులో శ్రీశైలం బ్యాక్‌వాటర్
- తాగునీటి అవసరాలకు మాత్రమే కొనసాగుతున్న ఎత్తిపోతలు
- సాగునీటి కాల్వలకు అందని నీళ్లు
- వరదలు రాకుంటే వానాకాలం పంటల సాగుకు తప్పని కష్టాలు

కొల్లాపూర్: గతేడాది మాదిరిగానే ఈసారి కూడా వర్షాలు ఆశించిన స్థాయిలో కురవడం లేదు. ఎగువ రాష్ట్రాల్లో కూడా పరిస్థితులు ఇలాగే ఉండటంతో జీవనదులకు వరద జలాలు చేరడం లేదు. వర్షాభావ పరిస్థితులతో కృష్ణానదికి వరద రాకపోవడంతో శ్రీశైలం బ్యాక్‌వాటర్ లెవెల్స్ క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. ప్రస్తుతం తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు లేనప్పటికీ.. పంటల సాగుకు మాత్రం ఇక్కట్లు ఎదురయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జూలైలో వచ్చే వరద జలాలపైనే ఈ ఏడాది తాగు, సాగునీటి అవసరాలు తీరే అంశాలు ఆధారపడి ఉన్నాయి.

రెండేళ్లుగా వరదలు ఆలస్యం..

వర్షాకాలం ప్రారంభమయ్యాక జూన్ చివరి వారం లేదా జూలై మొదటి వారంలో కృష్ణానదికి వరదలు వచ్చేవి. జూలై చివరి నాటికి కృష్ణానది నిండుకుండలా ఉండేది. అయితే గత రెండేళ్లుగా వర్షాభావ పరిస్థితులతో జూలై 20వ తేదీ తర్వాత కృష్ణానదికి వరద జలాలు చేరుతున్నాయి. ఆగస్టు నెలాఖరు నాటికి శ్రీశైలం బ్యాక్‌వాటర్ నిర్ణీత లెవెల్స్‌కు చేరుకుంటున్నాయి. ఈసారి కూడా అవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. కాగా, రెండేళ్ల కాలంలో జూలై ప్రారంభంలో శ్రీశైలం బ్యాక్‌వాటర్ లెవెల్స్ 840 అడుగులకు పైగా ఎత్తులో ఉండేవి. ఈసారి అవి 813 అడుగులకే పరిమితమయ్యాయి. ప్రస్తుతం శ్రీశైలంలో 36.40 టీఎంసీల నీటినిల్వ ఉంది. 29 టీఎంసీలు డెడ్‌స్టోరేజ్ కాగా.. 7 టీఎంసీలను తాగునీటి అవసరాలకు వినియోగించుకోవచ్చు. శ్రీశైలం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ లెవెల్స్ 860 అడుగుల ఎత్తు దాటిన తర్వాతే సాగునీటి అవసరాలకు నీటి ఎత్తిపోతలు చేపట్టాల్సి ఉంటుంది.

ప్రస్తుతం తాగునీటి అవసరాలకే..

కృష్ణానది నీటిమట్టం పెరగక పోవడంతో కేఎల్‌ఐ ద్వారా ప్రస్తుతం తాగునీటి అవసరాలకు మాత్రమే నీటిని ఎత్తిపోస్తున్నారు. సాగు అవసరాలకు నీళ్లు వదలడం లేదు. దీంతో వానాకాలం పంటల సాగుచేస్తున్న రైతులు బోరుబావులపైనే ఆధారపడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో రైతులు కొంత ఉపశమనం పొందారు. లేదంటే పంటలు పెద్ద మొత్తంలో దెబ్బతినేవి. కృష్ణానదికి వచ్చే వరద కోసం రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

ఎత్తిపోతలకు మూడు మోటార్లే..

కేఎల్‌ఐలోని ఎల్లూరు పంప్‌హౌస్‌లో ఐదు మోటార్లు ఉన్నాయి. వీటిలో ఒకటి స్పేర్‌లో ఉంచి, మిగతా నాలుగింటితో ఎత్తిపోతల కొనసాగించేలా ప్రాజెక్టును నిర్మించారు. ఐదింటిలో రెండు మోటార్లు మరమ్మతుకు గురయ్యాయి. మిగిలిన మూడు మోటార్లలో ఒక దాన్ని స్పేర్‌లో ఉంచి, రెండు మోటార్లతో ఎత్తిపోతలు చేపట్టేందుకు ప్రాజెక్టు అధికారులు ఏర్పాట్లు చేశారు.

కేఎల్‌ఐ ఆయకట్టు **4,24,816** ఎకరాలు

ప్రాజెక్టు పరిధిలో ఉన్న మండలాలు **27**

ఎత్తిపోతలకు అనుసంధానంగా ఉన్న రిజర్వాయర్లు : ఎల్లూరు, సింగోటం, జొన్నలబొగుడ, గుడిపల్లిగట్టు

రిజర్వాయర్లలో నీటినిల్వ సామర్థ్యం : **4** టీఎంసీలు

వరద వస్తేనే..



శ్రీశైలం డ్యాంలో 36 టీఎంసీల మేరకు బ్యాక్ వాటర్ లెవెల్స్ ఉన్నాయి. 29 టీఎంసీలు డెడ్ స్టోరేజ్ కాగా.. 7 టీఎంసీలను తాగునీటి అవస రాలకు వాడుకోవచ్చు. సాగు అవసరాలకు నీటిని విడుదల చేయాలంటే, వరద జలాలు రావాలి. ప్రస్తుతం సాగు అవసరాలకు నీటిని విడుదల చేయలేం. వరద జలాలు వస్తే కేఎల్‌ఐ ద్వారా నీటి పంపింగ్ చేపట్టి, ప్రాజెక్టు పరిధిలోని రిజర్వా యర్లు, చెరువులు నింపుతాం. సాగు అవసరాల కోసం కాల్వలకు నీటిని వదులుతాం. శ్రీశైలం డ్యాం బ్యాక్‌వాటర్ లెవెల్స్‌ను రెగ్యులర్‌గా గమనిస్తున్నాం.

– శ్రీనివాసరెడ్డి, ఈఈ, నీటిపారుదల శాఖ

రోజుకు 0.18 టీఎంసీ నీటిని ఎత్తిపోసేలా..

ఎల్లూరు పంప్‌హౌస్‌లోని ఒక్కో మోటారు ద్వారా రోజూ 0.06 టీఎంసీ నీటిని ఎత్తిపోసే అవకాశం ఉంది. ప్రస్తుతం పంప్‌హౌస్‌లో ఉన్న మూడు మోటార్లతో 0.18 టీఎంసీ నీళ్లను ఎత్తిపోసుకోవచ్చు. ఒక మోటారు స్పేర్‌లో ఉంచి, రెండు మోటార్లతోనే పంపింగ్ చేపడితే, రోజూ 0.12 టీఎంసీ నీటిని మాత్రమే ఎత్తిపోసుకునే వీలుంటుంది. ఎల్లూరు రిజర్వాయర్‌లో నీటినిల్వ సామర్థ్యం 0.36 టీఎంసీ మాత్రమే. అక్కడి నుంచి సింగోటం, జొన్నలబొగుడ, గుడిపల్లిగట్టు రిజర్వాయర్లకు నీటిని తరలిస్తారు.


కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి నీటిని మళ్లించే కోతిగుండు ప్రాంతంలో కృష్ణానది నీటిమట్టం

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో సత్తాచాటాలి


అథ్లెటిక్స్ ఎంపికలను ప్రారంభిస్తున్న అసోసియేషన్ సభ్యులు

కల్వకుర్తి టౌన్: గ్రామీణ క్రీడాకారులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటాలని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విజేందర్ అన్నారు. పట్టణంలోని సీబీఎం కళాశాలలో ఆదివారం జిల్లా ప్రధాన కార్యదర్శి డా.స్వాములతో కలిసి జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలను ప్రారంభించారు. ఈసందర్భంగా విజేందర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎంతో మంది ప్రతిభ క్రీడాకరులు ఉన్నారన్నారు. గ్రామీణ క్రీడాకారులను గుర్తించి, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో రాణించేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికల్లో అండర్-14, 16, 18, 20 విభాగాలకు చెందిన 150 మంది క్రీడాకారులు పాల్గొనగా.. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని వచ్చేనెలలో రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీలు ప్రసాద్, రాజేందర్, సైదులు, మల్లేష్, రాజు, రాణి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు తురబ్, చంద్రశేఖర్, కొండల్ పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు కల్పించడం అభినందనీయం


- యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి



మాట్లాడుతున్న చావ రవి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేసినందుకు అభినందనలు తెలుపుతున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చావ రవి తెలిపారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 19 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పీఈటీలు, పండిట్ల అప్‌గ్రెడేషన్ కూడా పూర్తి చేయడం మంచి విషయమని.. గురుకులాల్లో కూడా బదిలీల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. లెఫ్ట్ ఓవర్ వేకెన్సీలో ప్రమోషన్లు ఇవ్వాలని, బదిలీ అయిన ఎస్జీటీ ఉపాధ్యాయులు వెంటనే విధుల్లో చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. స్పౌజ్ పాయింట్లను వినియోగించుకుని బదిలీ అయిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ బిల్లులు, డీఏలు విడుదల చేయాలని, డిప్యూటీ విద్యాశాఖ అధికారులు, ఎంఈఓల పోస్టులు భర్తీ చేయాలని కోరారు. మోడల్ స్కూల్స్, కేజీబీవీలు, యూఆర్ఎస్‌లలో బదిలీలు చేపట్టాక నియామకాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకుడు రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కిష్టయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, రవికుమార్, ఉమాదేవి, భాస్కర్, అజయ్, మన్యం, కిష్టానాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్షణికావేశంలో విద్యార్థి బలవన్మరణం


కిరణ్ (ఫైల్)

నర్వ: తల్లిదండ్రులు మందలించారని క్షణికావేశానికి గురైన ఓ విద్యార్థి ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్‌ఐ కుర్మయ్య కథనం ప్రకారం.. మండలంలోని యాంకి గ్రామానికి చెందిన బోయ శంకర్, జయమ్మ దంపతుల రెండో కుమారుడు కాటే కుమార్(15) నర్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. శనివారం పాఠశాలకు సెలవు కావడంతో తల్లిదండ్రులతో కలిసి పొలానికి వెళ్లాడు. పొలం పనుల్లో తల్లిదండ్రులకు సహాయం చేసి మధ్యాహ్నం ఇంటికి వచ్చి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాయంత్రం పొలం నుంచి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు ఇల్లు తెరిచి చూడగా ఉరివేసుకుని కనిపించాడు. వెంటనే కిందకి దించి చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అయితే పొలం పని విషయంలో తల్లిదండ్రులు మందలించడంతోనే క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

సొంత చెల్లిపై అన్న అత్యాచారం

బిజినేపల్లి: రాళ్లు కొట్టి పనిచేస్తున్న అన్నకు అన్నం వండి పెట్టాలని వచ్చిన సొంత చెల్లిపైనే అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన బిజినేపల్లి మండలంలోని కీమ్యాతండాలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. కర్నూలు జిల్లా డోన్‌కు చెందిన కుటుంబంలోని తల్లి, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు మహబూబ్‌నగర్‌కు వలస వచ్చి జీవనం సాగిస్తున్నారు. కాగా 21 ఏళ్ల కుమారుడు బిజినేపల్లి మండలం కీమ్యాతండా సమీపంలోని రాళ్లు కొట్టి జీవనం సాగిస్తున్నాడు. అతను రోజు రాళ్లు కొట్టి, వచ్చి తానే వంట వండుకుని తినడానికి ఇబ్బంది పడుతున్నాడని భావించిన తల్లి 13 ఏళ్ల కూతురుని అన్న వద్దకు పంపించింది. ఈ క్రమంలో ఆ యువకుడు చెల్లికి మాయమాటలు చెప్పి కొద్ది రోజులుగా శారీరకంగా అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ విషయం గమనించిన స్థానికులు తల్లికి చెప్పడంతో ఆమె కుమారుడిని తీవ్రంగా మందలించింది. తర్వాత అన్నాచెల్లెలు ఇద్దరు కొద్దిరోజులపాటు వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం బుద్దారం అటవీ ప్రాంతంలో సంచరించడం గమనించిన సమీప గ్రామ ప్రజలు చైల్డ్ లైన్‌కు సమాచారం ఇచ్చారు. వారు బాలికను అదుపులోకి తీసుకుని విచారించి జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అటు నుంచి మహబూబ్‌నగర్‌కు, అక్కడి నుంచి బిజినేపల్లి పోలీస్ స్టేషన్‌కు కేసును బదిలీ చేశారు. బిజినేపల్లి పోలీసులు బాలికను వైద్య పరీక్షల నిమిత్తం నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై బిజినేపల్లి ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి వివరణ కోరగా విచారణ కొనసాగుతుందని, పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


నర్సింహులు (ఫైల్)

పెబ్బేరు రూరల్: పెబ్బేరు పట్టణంలోని సంత బజారులో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి వివరాల మేరకు.. శ్రీరంగాపురం మండలం నాగరాలకు చెందిన కొమారి నర్సింహులు (54) ఏడేళ్ల క్రితం పెబ్బేరులో ఇల్లు నిర్మించుకొని ఇక్కడే నివాసం ఉంటున్నాడు. అతడికి భార్య గోవిందమ్మ, కూతురు, కుమారుడు ఉన్నారు. ఈనెల 12న మృతుడి భార్య పిల్లలతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న నర్సింహులు గాయాలతో మంచంపై పడి ఉన్నాడని శనివారం సాయంత్రం స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు ఇంటికి చేరుకొని చూడగా, అప్పటికే మృతిచెంది కనిపించాడు. నర్సింహులు మృతిపై పలు అనుమానాలు వ్యక్తంచేశారు. మృతుడి సోదరుడి కుమారుడు ప్రమోద్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఫుట్‌బాల్ టోర్నీ విజేత పాలమూరు


ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న మహబూబ్‌నగర్-నిజామాబాద్ జట్లు

- హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్
- తుదిపోరులో 1-0 తేడాతో నిజామాబాద్‌పై విజయం
- మూడో స్థానంలో నిలిచిన ఖమ్మం, నల్లగొండ
- విజేతలకు బహుమతులు అందజేసిన రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఫాల్గుణ


రుత్విక


8 గోల్స్ సాధించిన ఆనందవర్షిని

కల్వకుర్తి టౌన్: కల్వకుర్తి పట్టణంలోని స్టేడియంలో నిర్వహించిన తెలంగాణ 10వ రాష్ట్రస్థాయి బాలికల సబ్ జూనియర్ ఫుట్‌బాల్ టోర్నీ విజేతగా పాలమూరు జట్టు నిలిచింది. ఆదివారం జరిగిన సెమీ ఫైనల్‌లో నాలుగు జట్లు తలపడగా.. మహబూబ్‌నగర్, నిజామాబాద్ జట్లు ఫైనల్‌కు చేరాయి. హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు సమీప ప్రత్యర్థి నిజామాబాద్‌పై 1-0 గోల్స్ తేడాతో గెలుపొందింది. మొదటి అర్ధభాగంలో ఎలాంటి గోల్స్ సాధించని జట్లు.. రెండో అర్ధభాగంలో 10 నిమిషాల తర్వాత ఒక గోల్‌ను మహబూబ్‌నగర్ సాధించింది. జట్టు కెప్టెన్ అక్షర ఫుట్‌బాల్‌ను గోల్‌వైపు కొట్టగా, అక్కడే ఉన్న క్రీడాకారిణి రుత్విక గోల్ సాధించింది. నిజామాబాద్ సైతం గోల్ కొట్టేందుకు తీవ్రంగా శ్రమించినా.. విజయం వరించలేదు. మ్యాచ్ ఆడుతుండగా చిన్నపాటి వర్షం కురిసింది. అయినప్పటికీ వర్షంలోనే మ్యాచ్‌ను కొనసాగించారు.

టైబ్రేకర్‌తో ఫైనల్‌కు పాలమూరు..

మొదటి సెమీ ఫైనల్‌లో మహబూబ్‌నగర్-ఖమ్మం జట్లు తలపడగా.. టై బ్రేక్‌గా నిలిచింది. మహబూబ్‌నగర్ 5-0కు గాను 4-0 సాధించగా, ఖమ్మం ఒక గోల్‌కే పరిమితమైంది. రెండో సెమీ ఫైనల్‌లో నల్లగొండ-నిజామాబాద్ జట్లు తలపడగా.. క్రీడాకారిణి హరిణి కొట్టిన గోల్‌తో నిజామాబాద్ ఫైనల్‌కు చేరుకుంది. ఫైనల్‌లో మహబూబ్‌నగర్-నిజామాబాద్ జట్లు తలపడగా.. మహబూబ్‌నగర్ జట్టు క్రీడాకారిణి రుత్విక కొట్టిన గోల్‌తో విజయ తీరాలను చేరుకున్నారు. మొదటి విజేతగా నిలిచిన మహబూబ్‌నగర్ జట్టుకు మెడల్స్‌తో పాటు ట్రోఫీని రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఫాల్గుణ ప్రదానం చేశారు. రన్నరప్‌గా నిలిచిన నిజామాబాద్ జట్టుకు రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎన్పీ. వెంకటేశ్ అందజేశారు. తృతీయ స్థానంలో నిలిచిన ఖమ్మం, నల్లగొండ క్రీడాకారులు మెడల్స్‌తో పాటు ట్రోఫీలను అందుకున్నారు. టోర్నీలో అత్యధికంగా ఆనంద వర్షిణి, అక్షర చెరో 8 గోల్స్ సాధించారు. వీరిద్దరూ పాలమూరు జట్టుకు ప్రాతినిధ్యం వహించడం విశేషం. ఉత్తమ గోల్ కీపర్‌గా వనపర్తికి చెందిన స్వరూప నిలిచింది. వీరందరికీ మెడల్స్‌తో పాటు ట్రోఫీలను అందజేశారు.

క్రీడలకు ప్రాధాన్యం..

రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తుందని రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఫాల్గుణ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి క్రీడలపై ఎంతో మక్కువ ఉందని.. క్రీడలకు అధికంగా నిధులు కేటాయించే అవకాశం ఉందన్నారు. శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి ఉమ్మడి జిల్లాకు చెందిన వ్యక్తి కావడంతో క్రీడలకు మరింత ప్రాధాన్యం ఉంటుందని ఆశాభావం వ్యకంచేశారు. వర్షంలోనూ క్రీడాకారులు ప్రతిభను చాటారని అభినందించారు. బాలికలు క్రీడలలో ఉత్తమంగా రాణించడం సంతోషంగా ఉందని రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్ అన్నారు. స్థానిక స్టేడియంలో క్రీడాకారులకు కోచింగ్ చేస్తున్న వెంకట్రాములును శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి భానుకిరణ్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పాండు, కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యాదయ్య, కల్వకుర్తి ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు రాజేందర్, విజయభాస్కర్, చంద్ర జైపాల్ పాల్గొన్నారు.


రన్నరప్‌గా నిలిచిన నిజామాబాద్ జట్టు


భూమి రిజిస్ట్రేషన్ చేయడం లేదని రైతు ఆందోళన

లింగాల: తన తల్లి పేరిట ఉన్న భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని ఆర్నెల్ల కిందట స్లాట్ బుక్ చేసినా.. తహసీల్దార్ చేయకుండా వేధిస్తున్నారని మండలంలోని దత్తారం గ్రామానికి చెందిన రైతు తోకల గోపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన కథనం మేరకు.. తన తల్లి తోకల బొజ్జమ్మ పేరిట 4.20 ఎకరాల భూమి ఉందని, ఆమె 2021, మార్చిలో జరిగిన ప్రమాదంలో మృతి చెందినట్లు చెప్పారు. విరాసత్ చేయాలంటూ 2024, జనవరి 30న స్లాట్ బుక్ చేసుకున్నానని.. తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. మూడు నెలల కిందట ఆర్‌ఐ సీతారాం గ్రామానికి వచ్చి విచారణ కూడా చేశారని.. అయినప్పటికీ ఎలాంటి స్పందన లేదన్నారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం గతేడాది డిసెంబర్‌లో దరఖాస్తు చేసుకున్నా నేటికీ జారీ చేయలేదని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయాన్ని తహసీల్దార్ ఉమ వద్ద ప్రస్తావించగా.. తోకల బొజ్జమ్మకు గోపాల్ సొంత కుమారుడు కాదని, గోపాల్‌ను దత్తత తీసుకున్నట్లు ఎలాంటి ధ్రువీకరణ పత్రం లేదన్నారు. సరైన పత్రాలు సమర్పించకపోవడంతో రిజిస్ట్రేషన్ చేయడం లేదని వివరించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

అడ్డాకుల: తాళం వేసిన ఇంట్లోకి దొంగలు చొరబడి బీరువాలో ఉన్న 2 తులాల బంగారం ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని శాఖాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్, బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మల్లేష్, సుజాత దంపతులు ఈ నెల 13న ఇంటికి తాళం వేసి వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్లలో ఉండే బంధువుల ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటి తలుపులు తెరుచుకొని కనిపించడంతో ఇంటి పక్కల వారు వెంటనే మల్లేష్‌కు ఫోన్‌చేసి సమాచారమిచ్చారు. ఆయన వచ్చి చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా బీరులో ఉన్న నల్లపూసల దండ, చెవికమ్మలు కలిపి మొత్తం రెండు తులాల బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. జిల్లాకేంద్రం నుంచి వచ్చిన క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. పల్లె సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు.

కేసు నమోదు


స్వాధీనం చేసుకున్న పార్వతీదేవి విగ్రహం

తెలకపల్లి: ఆలయంలో విగ్రహాన్ని చోరీ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన మాయని శ్రీను ఈ నెల 12 అర్ధరాత్రి మండలంలోని చిన్నముద్దునూర్ రామాలయంలో బీరువా విరగ్గొట్టి అందులో ఉన్న పార్వతీదేవి పంచలోహ విగ్రహాన్ని దొంగలించారు. ఆలయ కార్యదర్శి వేంరెడ్డి సుదర్శన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించారు. శనివారం రాత్రి తెలకపల్లి కల్లు దుకాణం వద్ద అనుమానాస్పదస్థితిలో కనిపించగా పట్టుకొని విచారించారు. విగ్రహాన్ని దొంగిలించింది తానేనని ఒప్పుకున్నాడు. విగ్రహాన్ని స్వాధీనం చేసుకొని అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.

క్లుప్తంగా...

ఏపీలో మరో రెండు రోజులు వర్షాలు

ఉపరితల ఆవర్తనం ఫలితం



సాక్షి, అమరావతి: ఉపరితల ఆవర్తనం ప్రభావంతో వచ్చే రెండురోజులు ఏపీ వ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. పశ్చిమబెంగాల్, జార్ఖండ్, ఒడిశా మీదుగా ఉన్న ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి కొనసాగుతుండగా, శనివారం పశ్చిమ బంగాళాఖాతం, కోస్తాంధ్ర తీరంలో ఏర్పడి సముద్రమట్టానికి సగటున 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం దాంతో కలిసిపోయింది. దీని ప్రభావంతో వచ్చే రెండురోజులు రాష్ట్ర వ్యాప్తంగా తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తా యని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. అనేకచోట్ల ఉరుములతో కూడిన జల్లులు పడతాయని, అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, పలుప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వివరించారు. ఆదివారం ఏపీలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. అల్లూరి సీతారామ రాజు జిల్లా కొయ్యూరులో 24 గంటల్లో 9.4 సెంటీమీటర్ల వర్షం కురిసింది. తూర్పుగోదా వరి జిల్లా తాళ్లపూడిలో 6 సెంటీమీటర్లు, పశ్చిమగోదావరి జిల్లా పోలవరంలో 7, కదిరిలో 4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

శ్రీవారి ఆలయంలో రేపు ఆణివార ఆస్థానం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో జూలై 16న సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినం ఘనంగా నిర్వహించనున్నారు. ఆ రోజున సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి శోభాయమానంగా అలంకరించిన పుష్పపల్లకిపై తిరుమల వీధుల్లో ఊరేగుతారు. ఆణివార ఆస్థానం కారణంగా జూలై 16న అష్టదళ పాద పద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

దర్శనానికి 24 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. భక్తులతో అన్ని కంపార్ట్‌మెంట్లు నిండి క్యూ లైన్ టీబీసీ వద్దకు చేరుకుంది. శనివారం అర్ధ రాత్రి వరకు 75,916 మంది శ్రీవారిని దర్శించుకుని హుండీలో రూ.3.87 కోట్లు వేశారు. టైంస్లాట్ టోకెన్లు ఉన్నవారికి సకాలంలో, దర్శన టికెట్లు లేనివారికి 24 గంటల్లో, ఎస్ఈడీ టికెట్లు ఉన్నవారికి 2 గంటల్లో దర్శనమవుతోంది.

రూ.3,000 నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు?

ఏపీలో 1.60 కోట్ల కుటుంబాల ఎదురుచూపులు

జాబ్ కేలండర్, నిరుద్యోగ భృతిపై నిరుద్యోగులు గంపెడాశలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగాలు, ఉపాధి కోసం యువత ఎదురు చూస్తోంది. జాబ్ కేలండర్‌పై గంపెడాశలు పెట్టుకుంది. చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు ఇంటికో ఉద్యోగం వచ్చేంత వరకు 'నిరుద్యోగ భృతి'ఇవ్వాలని కోరుతోంది. అధికారంలోకి వచ్చి నెల దాటినా, నిరుద్యోగ భృతి గురించి మాట్లాడటం లేదని, ఎప్పటి నుంచి ఇస్తారో స్పష్టంగా చెప్పాలని ఆంధ్రప్రదేశ్‌లోని 1.60 కోట్ల కుటుంబాల్లోని యువత డిమాండ్ చేస్తోంది. 2014లో చంద్రబాబు ఇంటికొక ఉద్యోగం లేకుంటే నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులను నట్టేట ముంచారు. మరోసారి అలాంటి హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. ప్రభుత్వం ఏర్పడి నెల రోజులైనా నిరుద్యోగ భృతిపై నోరు మెదపక పోవడం నిరుద్యోగులను ఆందోళనకు గురిచేస్తోంది. గతంలో మూడుసార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు.. మళ్లీ బూటకపు హామీలతోనే ఇప్పుడు నాలుగోసారి అధికారంలోకి వచ్చారు. కానీ, ఆయన రాజకీయ జీవితంలో చెప్పింది చెప్పినట్లు ఏనాడు ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిన దాఖలాలు లేవు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం, హామీలను అమలు చేయడం ఆయన డిక్షనరీలోనే లేదు. ఇలాంటి పరిస్థితుల్లో భారీ సంఖ్యలో యువత ప్రభుత్వ కొలువులు వస్తాయని.. లేదంటే నిరుద్యోగ భృతి అందుతుందనే ఆశతో ఎదురు చూస్తోంది. చాలా మంది ప్రస్తుతం చేస్తున్న చిన్నా చితకా పనులు వదిలేసి.. స్టడీ సర్కిళ్లు, లైబ్రరీల బాట పడుతున్నారు. కుటుంబానికి ఆర్థిక భారంగా మారినప్పటికీ ప్రభుత్వం ఇచ్చే భృతితో ఎలాగోలా నెట్టుకు రావచ్చనే ఉద్దేశంతో పోటీ పరీక్షల్లో రాణించేందుకు ప్రణాళికలు వేసుకుంటున్నారు.

సూపర్ సిక్స్ టాప్‌లో భృతి

ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన తమ ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్‌లో నిరుద్యోగులకు పెద్ద పీట వేస్తున్నట్టు ప్రకటించారు. నిరుద్యోగులందరికీ ఉద్యోగాల కల్పనతో పాటు ఉద్యోగం వచ్చేంత వరకు ప్రతి ఒక్కరికీ నెలకు రూ.3 వేల భృతి ఇస్తామంటూ ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల దాటినప్పటికీ ఆ ఊసే ఎత్తట్లేదు. మెగా డీఎస్సీ పేరుతో నామమాత్రంగా ప్రకటించిన 16 వేల పోస్టుల భర్తీ కాస్తా నత్త నడకను తలపిస్తోంది. డిగ్రీ అర్హతతో ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూప్స్ పరీక్షలతో పాటు ఇంటర్మీడియట్, పదవ తరగతి అర్హతతో ప్రభుత్వ కొలువుల కోసం పోటీపడే వారు లక్షల్లో ఉన్నారు. వీరితో పాటు ప్రభుత్వ కొలువు సాధించేందుకు ఇంకా వయస్సు ఉండి.. ఆర్థిక తోడ్పాటు లేక పోటీ పరీక్షలను పక్కన పెట్టి ఊళ్లలో వ్యవసాయం, పట్టణాల్లో చిన్న చిన్న పనులు చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్న వారందరినీ కలుపుకుంటే దాదాపు ప్రతి ఇంటిలో ఒక నిరుద్యోగి కనిపిస్తున్న పరిస్థితి. ప్రభుత్వ కొలువుల కోసం కష్టపడి ఆగిపోయిన వారందరూ కూటమి ప్రభుత్వ నిరుద్యోగ భృతి హామీతో తిరిగి పోటీ పరీక్షల వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే ప్రభుత్వం ఈ హామీని అమలు చేయడంలో జాప్యం చేస్తుండటంతో నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో చేసినట్టే చేస్తారా?

గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు 2014–19లో నెలకు రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి.. ఐదేళ్లు పబ్బం గడుపుకుని మొండి చెయ్యి చూపించారు. అప్పట్లో కూడా ఇంటికో ఉద్యోగం అని ఊదరగొట్టి నిరుద్యోగులను నట్టేట ముంచారు. నిరుద్యోగ భృతికి 2017–18లో రూ.500 కోట్లు కేటాయింపులు చేసినప్పటికీ, రూపాయి కూడా ఇవ్వలేకపోయారు. అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రంగా ఒత్తిడి తేవడంతో ఎన్నికలకు ముందు యువ నేస్తం పేరుతో తూతూ మంత్రంగా డ్రామా నడిపించారు. విధివిధానాల రూపకల్పనకు మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసి సవాలక్ష ఆంక్షలు విధించి నిరుద్యోగ భృతి ఇచ్చే వారి సంఖ్యను భారీగా కుదించారు. తొలుత 12 లక్షల మందికి పైగా నిరుద్యోగ భృతికి అర్హులుగా తేల్చగా.. ఆ తర్వాత పది లక్షలకు కుదించారు. మళ్లీ అందులో 2.10 లక్షల మందే అర్హులంటూ.. 1.62 లక్షల మందికే ఇస్తామని.. దీనికి ఈ–కేవైసీ లింక్ పెట్టి కేవలం వేల సంఖ్యలో మాత్రమే నిరుద్యోగ భృతి ఇచ్చి మమ అనిపించారు. గతంలో ఇలా నిరుద్యోగ భృతి హామీని నీరుగార్చి.. ఉద్యోగాలను భర్తీ చేయకపోగా ఆరోగ్య మిత్రలను, ఫీల్డ్ అసిస్టెంట్లను, గోపాల మిత్రలను ఉద్యోగాల నుంచి తొలగించారు. ఈ సారైనా నిరుద్యోగులు అందరికీ ఉద్యోగాలతో పాటు ఉద్యోగం వచ్చే వరకు భృతి ఇవ్వాలని నిరుద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.



ఉద్యోగాల కల్పన

చంద్రబాబు పాలనలో..	వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో..	
2014-19 మధ్య చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఉద్యోగాలు 34,108	2019-24 మధ్య వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో శాశ్వత ఉద్యోగాలు 2,21,003	ఔట్ సోర్సింగ్, ఇతర ఉద్యోగాలు 3,73,695
మే 2019 నాటికి మొత్తం ఉద్యోగులు 3,97,128	కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగాలు 43,923	వైఎస్ జగన్ ప్రభుత్వం కల్పించిన మొత్తం ఉద్యోగాలు 6,38,621

'గంటా' ఆస్తుల వేలం!

రుణాలు ఎగ్గొట్టిన కేసులో టీడీపీ ఎమ్మెల్యేకు బ్యాంకు ఝలక్

- మొత్తం రూ.390 కోట్ల రికవరీకి చర్యలు
- ఇప్పటికే పలుమార్లు నోటీసులిచ్చిన ఇండియన్ బ్యాంకు
- అయినా స్పందించని గంటా, ఆయన బంధువులు
- ఆగస్టు 8న ఆస్తులు వేలం వేస్తామని బ్యాంకు ప్రకటన జారీ



సాక్షి, విశాఖపట్నం: మాజీమంత్రి, టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆయన బంధువులు రూ.వందల కోట్ల మేర రుణాలను ఎగ్గొట్టిన కేసులో వారికి అప్పులిచ్చిన ఇండియన్ బ్యాంకు ఆస్తుల వేలానికి ఉపక్రమించింది. రుణాలను వడ్డీతో సహా వసూలు చేసుకునేందుకు వరుసగా డిమాండ్ నోటీసులు జారీచేసినా గంటా బ్యాచ్ పట్టించుకోకపోవడంతో తనఖా పెట్టిన వాటిలో పలు ఆస్తులను ఇప్పటికే స్వాధీనం చేసుకున్న బ్యాంకు వాటి వేలానికి రంగం సిద్ధంచేసి అందుకు సంబంధించిన తేదీని తాజాగా ప్రకటించింది. గంటా రుణాల ఎగవేత కేసులకు సంబంధించిన వివరాలు ఏమిటంటే..

విశాఖపట్నం వన్‌టౌన్‌లోని లక్ష్మీటాకీస్ వద్ద ప్రత్యూష రిసోర్సెస్ అండ్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో మాన్యుఫ్యాక్చరింగ్, మిషనరీ అండ్ ఎక్విప్‌మెంట్ కార్యకలాపాల కోసం రిజిస్ట్రేషన్ నం .047165తో 2005 ఆగస్టు 18న రిజిస్టర్ అయ్యింది. రూ.500 కోట్ల ఆథరైజ్డ్ క్యాపిటల్, రూ.240.671 కోట్ల పెయిడ్ అప్ కాపిటల్‌తో ఈ సంస్థ ఏర్పడింది. కంపెనీలో యాక్టివ్ డైరెక్టర్లుగా గంటా తోడల్లుడైన పరుచూరి వెంకట భాస్కరరావు, ఆయన సోదరులు రాజారావు, వెంకయ్య, ప్రభాకరరావు ఉన్నారు. ఈ కంపెనీకి భీమిలి టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో పాటు కొండయ్య, బాలసుబ్రహ్మణ్యం, నార్నే అమూల్యలు హామీదారులుగా ఉన్నారు. కంపెనీ విస్తరణ పేరుతో డాబా గార్డెన్స్ శారదా వీధిలో ఉన్న ఇండియన్ బ్యాంకు నుంచి రుణాలు పొందారు. ఇవి పొందినప్పటి నుంచి ఒక్క వాయిదా కూడా చెల్లించలేదు. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరి 29 నాటికి ఒక దఫా తీసుకున్న రుణం తాలుకా బకాయిలు అక్షరాలా రూ.390.58 కోట్లుగా బ్యాంకు అధికారులు లెక్కగట్టారు. మరో దఫా రుణానికి సంబంధించి వడ్డీతో కలిసి రూ.141.68 కోట్లు బకాయిలుగా పేరుకుపోయాయని ఇండియన్ బ్యాంకు జారీచేసిన నోటీసుల్లో పేర్కొంది.

నోటీసులిచ్చినా బేఖాతరు.. ఆస్తుల స్వాధీనం..

ఈ నేపథ్యంలో.. 2016 అక్టోబరు 4 నుంచి పలు దఫాలుగా బ్యాంకు అధికారులు నోటీసులు జారీచేసి వడ్డీతో సహా కలిపి బకాయిలు చెల్లించాలని కోరారు. అయినాసరే ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం.. మరోపక్క గడువు ముగియడంతో బ్యాంకు ఆస్తులు స్వాధీనం చేసుకోవడం మొదలుపెట్టింది. అయినప్పటికీ గంటా ముందుకు రాకపోవడం.. బకాయిలు చెల్లించకపోవడంతో మరోసారి ఏడు ప్లాట్స్‌లో పూచీకత్తుగా పెట్టిన మరికొన్ని స్థలాల్ని స్వాధీనం చేసుకుంటున్నట్లు ఈ ఏడాది మార్చి 18న బ్యాంకు నోటీసులు జారీచేసింది. ప్రత్యూష కంపెనీకి చెందిన ఆస్తులు, కంపెనీ డైరెక్టర్లయిన పరుచూరి వెంకట భాస్కరరావు, రాజారావు, వెంకయ్య ప్రభాకరరావుల ఆస్తులతో పాటుగా కంపెనీకి హామీదారులుగా ఉన్న మంత్రి గంటా శ్రీనివాసరావు, కేబీ సుబ్రహ్మణ్యం, అమూల్య ఆస్తులను కూడా స్వాధీనం చేసుకోవడంతో పాటు మరికొన్ని ఆస్తుల వేలం వేస్తున్నట్లు బ్యాంకు ప్రకటన జారీచేసింది. కాగా, గతంలోనే బ్యాంకు కొన్ని ఆస్తులను వేలం వేయగా.. ఇప్పుడు రూ.390 కోట్ల రికవరీకి బ్యాంకు మరిన్ని ఆస్తుల వేలం ప్రకటన జారీచేసింది.

ఆగస్టు 8న ఈ–వేలం..

ఈ ప్రకటనలో.. పద్మనాభం మండలం ఐనద గ్రామం వద్ద ఉన్న సర్వేనెం.12లో వీరికి స్టార్ విలేజ్ పేరున వుడా లేఅవుట్‌లోని 5,326.54 చ.గజాల విస్తీర్ణంలో ఏడు ప్లాట్స్‌లో ఉన్న 33 ప్లాట్లను స్వాధీనం చేసుకుంటున్నట్లు నోటీసుల్లో స్పష్టం చేసింది. వీటి విషయంలో ఎలాంటి లావాదేవీలు జరపడానికి వీల్లేదని, బ్యాంకు హెచ్చరిక జారీచేసింది. అదేవిధంగా రూ.390.58 కోట్ల బకాయిలు రాబట్టుకునేందుకు గతంలో స్వాధీనం చేసుకున్న స్థిరాస్తుల విక్రయానికి కూడా మార్చి 18న బ్యాంకు మరోసారి నోటీసులు జారీచేసింది. దీనికి సంబంధించిన వేలం ప్రక్రియ కూడా నిర్వహిస్తున్నట్లు పత్రికల్లో శనివారం ఇండియన్ బ్యాంకు ప్రకటనలిచ్చింది. మెస్సర్స్ ప్రత్యూష అసోసియేట్స్ పేరుతో నగరంలోని గంగులవారి వీధిలో ఉన్న 274.65 చ.గజాల వాణిజ్య భవనం వేలం వేస్తున్నట్లు ప్రకటించింది. దీనికి రిజర్వ్ ధరగా రూ.2.56 కోట్లుగా నిర్ణయించింది. దీంతో పాటు ద్వారకానగర్‌లోని అదే సంస్థ పేరుతో శ్రీశాంత కాంప్లెక్స్‌లో ఉన్న ప్లాట్ నం .138సీ లోని 2,500 చ.గజాల విస్తీర్ణంగల రెండు ప్లాట్లను వేలం వేస్తున్నట్లు ప్రకటించారు. వీటికి రిజర్వ్ ధరగా 1.26 కోట్లుగా నిర్ణయించారు. ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా.. ప్రాతిపదికన వేలంలో విక్రయిస్తామని బ్యాంకు వెల్లడించింది. ఆగస్టు 8వ తేదీన గంటా అండ్ కో ఆస్తుల ఈ–వేలం పాట జరుగుతుందని ఇండియన్ బ్యాంకు పేర్కొంది.

ప్రజా సమస్యలపై పోరాటాలు కొనసాగించాలి



పాన్‌గల్: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు కొనసాగిస్తూ.. వాటి పరిష్కారం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జాన్‌వెస్లీ అన్నారు. ఆదివారం మండల కేంద్రం పాన్‌గల్‌లో పార్టీ కార్యాలయాన్ని జిల్లా కార్యదర్శి ఎండీ.జబ్బార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. మూడో సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వ పాలనలో ప్రజలకు చేసిందేమి లేదని విమర్శించారు. సామాన్య ప్రజలకు, రైతులకు, కూలీలకు, కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందన్నారు. రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తూ.. సీబీఐ, ఈడీ కేసులతో ప్రతిపక్ష పార్టీ నేతలను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. స్థానిక సంస్థల సమస్యలపై ప్రజలను చైతన్యం చేస్తూ.. వారి పక్షాన ఉంటూ పోరాటాలు చేస్తూ.. పార్టీ బలోపేతం కోసం పనిచేయాలన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి..

స్వామినాథన్ కమిషన్ సిపార్సులు అమలు చేస్తూ.. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ.జబ్బార్ అన్నారు. పంటల సాగు మొదలైన సాగునీటి కాల్వలో పేరుకుపోయిన జమ్ము, మట్టిని తొలగించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. జిల్లాలో మామిడి రైతుల కోసం మామిడి మార్కెట్‌ను ఏర్పాటు చేసి రైతుల ఇబ్బందులు తొలగించాలన్నారు. జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బాల్‌రెడ్డి, బాల్యానాయక్, వెంకటయ్య, భీమయ్య, రాము, వెంకటయ్య పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా సందడి



జిల్లాకేంద్రంలో గతేడాది జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్- 19 రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీ(ఫైల్)

పాఠశాల, కళాశాల స్థాయిలో టోర్నీలు

- తెలంగాణ క్రీడల షెడ్యూల్ విడుదల.. నాలుగు దశల్లో నిర్వహణ
- ఆగస్టు మొదటి వారం నుంచి పోటీలు ప్రారంభం

మహబూబ్‌నగర్ క్రీడలు: పాఠశాల, కళాశాలల విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్రతి ఏడాది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. పాఠశాల, కళాశాల స్థాయిలో అండర్- 14, 17 విభాగాల్లో బాల, బాలికలకు వేర్వేరుగా మండల స్థాయి మొదలుకొని జిల్లా, ఉమ్మడి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పోటీలు నిర్వహిస్తారు. అండర్–19 విభాగానికి సంబంధించి ఉమ్మడి జిల్లాస్థాయి టోర్నీ కం సెలక్షన్స్ నిర్వహించనున్నారు. ఎంతో మంది పాఠశాల, కళాశాలల విద్యార్థులు ఎస్‌జీఎఫ్ క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగి తమ ప్రతిభను చాటుతున్నారు. ఈ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలు విద్యార్థులకు ఒక వేదికలా ఉపయోగపడుతుంది.

సెలక్షన్స్‌పై నిర్ణయం..

ప్రతి ఏడాది పాఠశాల విద్యా సంవత్సరం ప్రారంభం తర్వాత జిల్లాలోని పీఈటీలతో సమావేశం నిర్వహించి, ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల సెలక్షన్స్‌పై నిర్ణయం తీసుకుంటారు. ఆగస్టు నుంచి ఈ ఏడాది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీలు ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలోని పాఠశాల, కళాశాలల క్రీడా పోటీలకు 2024- 25 సంవత్సరానికి సంబంధించి కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఎస్‌జీఎఫ్ క్రీడా షెడ్యూల్‌ను ఇటీవలే విడుదల చేసింది. నాలుగు దశల్లో ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు జరగనున్నాయి. ఆగస్టు మొదటి వారం నుంచి సెప్టెంబర్ నాలుగో వారం వరకు నాలుగు దశల్లో ఎస్‌జీఎఫ్ క్రీడలు జరగనున్నాయి. మండల, జిల్లా, ఉమ్మడి జిల్లా (జోనల్), రాష్ట్రస్థాయిల్లో ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు జరగనున్నాయి. కొత్త జిల్లాల ఎంపిక పోటీలను నిర్వహించుకొని పాత ఉమ్మడి జిల్లా జట్టుగా ఏర్పడి రాష్ట్ర పోటీలకు హాజరుకానున్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా షెడ్యూల్ విడుదల కావడంతో ఇక పాఠశాల, కళాశాలస్థాయిల్లో క్రీడల సందడి నెలకొంది.

షెడ్యూల్ వివరాలు ఇలా..

ఈవెంట్	క్రీడలు నిర్వహించే తేదీలు
మండల స్థాయి	ఆగస్టు మొదటి, రెండో వారం
జిల్లాస్థాయి టోర్నీ కం సెలక్షన్స్ (అంతర్ మండలాలు)	ఆగస్టు మూడో వారం
ఉమ్మడి (జోన్) జిల్లాస్థాయి టోర్నీకం సెలక్షన్స్	సెప్టెంబర్ రెండో వారం
రాష్ట్రస్థాయి పోటీలు (పాత జిల్లాల స్థాయి)	సెప్టెంబర్ నాలుగో వారం

పకడ్బందీగా నిర్వహిస్తాం..



ఈ ఏడాది అండర్- 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు వ్యాయామ ఉపాధ్యాయుల సహకారంతో పకడ్బందీగా నిర్వహిస్తాం. గతేడాది ఉమ్మడి జిల్లాకు కేటాయించిన రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, క్రికెట్ పోటీలను విజయవంతంగా నిర్వహించాం. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడాటోర్నీల ప్రతిపాదనలు త్వరలో పంపుతాం.

– పాపిరెడ్డి, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి, మహబూబ్‌నగర్

క్రీడా నైపుణ్యం వెలికి..



ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలతో విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయవచ్చు. విద్యార్థులు ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలి. విద్యార్థులు జిల్లా, ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎదగాలి.

– వేణుగోపాల్, ఫిజికల్ డైరెక్టర్, చిన్నదర్పల్లి, మహబూబ్‌నగర్

సూర్య నమస్కారాలతో మానసిక బలం

- శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ




ద్వాదశ జ్యోతిర్లింగార్చన పూజలు నిర్వహిస్తున్న పండితులు

నాగర్‌కర్నూల్: నమస్కార ప్రియా భాస్కర.. నమస్కారంతో సూర్యుడు ప్రీతి చెందుతాడని, జన్మజన్మల నుంచి వేధిస్తున్న రోగాలు దరి చేరకుండా ఉండాలన్నా, మానసిక బలం పెరగాలన్నా సూర్యనమస్కారాలు చేయడం అత్యంత సులువైన మార్గమని కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ వివరించారు. నాగర్‌కర్నూల్‌లోని ఓంనగర్‌కాలనీలో కొనసాగుతున్న 83వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవంలో భాగంగా 8వ రోజు ఆదివారం గోపూజ, యాగశాల ప్రదక్షిణలు, వేద, చండీ, రుద్ర హోమాలు, రామాయణం, భాగవత సుందరకాండ చతుర్వేద హోమాలు నిర్వహించారు. మండపంలో అందంగా సూర్యయంత్రాన్ని రూపొందించి అవహనాది క్రతువులు జరిపించారు. 22 మంది దంపతులు సంతాన ప్రాప్తికి పుత్ర కామేష్టి యాగం.. సాయంత్రం చిన్న పిల్లలను అమ్మవారి రూపంగా భావించి బాల పూజలు చేశారు. అనంతరం పరమేశ్వరుడికి రుద్రాక్ష, బిల్వాలతో అర్చించారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు భక్తులను ఆశీర్వదించి ప్రసాదం అందజేశారు. హోమ యాగాల నిర్వహణకు ద్రవ్య, వస్తు రూపేణా సహకరించాలని కోరారు. సోమవారం అమృత పాశుపత మృత్యుంజయ సహితరుద్ర హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



నమస్కరిస్తున్న భక్తులు

ఖిల్లా కోటపై భక్తుల రద్దీ



దర్శనానికి బారులు తీరిన భక్తులు

కోయిల్‌కొండ: పట్టణంలోని ఖిల్లా కోటపై కొలువుదీరిన బీబీ ఫాతిమా పీర్లను దర్శించుకునేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచేగాక ఇతర జిల్లాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. 7వ రోజు ఆదివారం సెలవుదినం కావడంతో భక్తుల రద్దీ భారీగా పెరిగింది. గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తాగునీటి వసతి కల్పించారు.

ఆల్మట్టికి ప్రారంభమైన వరద

జూరాలకు 3,271 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు/ దోమలపెంట: మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో ఆల్మట్టి ప్రాజెక్టుకు వరద ప్రారంభమైందని పీజేపీ అధికారులు తెలిపారు. ప్రస్తుత వర్షాకాలంలో మొదటిసారిగా ప్రాజెక్టుకు 28,130 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 123.081 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 91.130 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దీంతో ప్రాజెక్టు నుంచి 15 వేల క్యూసెక్కుల ఔట్ ఫ్లో ఉన్నట్లు అధికారులు చెప్పారు. అలాగే నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 33.31 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 21.857 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టుకు 3,413 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. ఇదిలా ఉండగా.. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఆదివారం ఎగువ నుంచి 3,271 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో నెట్టెంపాడు ఎత్తిపోతల పథకానికి నీటి పంపింగ్‌ను కొనసాగిస్తున్నారు. నెట్టెంపాడు పంపు ద్వారా 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 110 క్యూసెక్కులు, భీమా లిఫ్టు- 1 528 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 390 క్యూసెక్కులు కలిపి మొత్తం ప్రాజెక్టు నుంచి 1,778 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.627 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ నెల 17 నాటికి జూరాలకు ఎగువ నుంచి భారీగా నీటిని విడుదల చేయనున్నారని, ప్రాజెక్టు దిగువన ఉన్న విద్యుత్ కేంద్రం, క్రస్టు గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది.



జూరాల ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

శ్రీశైలంలో 813.2 అడుగులు..

శ్రీశైలం జలాశయంలో ఆదివారం నీటిమట్టం 813.2 అడుగుల వద్ద 36.2436 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకి 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా.. 64 క్యూసెక్కుల నీరు ఆవిరైంది. స్థానికంగా మి.మీ., వర్షపాతం నమోదైంది.